@netifocusnews @focustv

http://epaper.netifocusnews.com
www.netifocusnews.com
TS-18-0006625

FOCUS TELUGU TV
అనునిత్యం - ప్రజాపక్షం

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

తెలుగు డిజిటల్ దినపత్రిక

ఎడిటర్: యం.తరుణ్ | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక | హైదరాబాద్ | గురువారం 25, జూలై 2024 | పేజీలు: 04

# ఢిల్లీలో దీక్షకు సిద్ధం



- సిద్ధమేనా అని ప్రశ్నించిన సీఎం రేవంత్
- కేటీఆర్, హరీశ్‌రావుల ప్రశ్నకు సమాధానం

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–జూలై 23:

రాష్ట్రానికి నిధుల కోసం ఢిల్లీలో దీక్ష చేయాలని భారాస ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్ రావు చేసిన డిమాండ్‌పై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద దీక్ష చేసేందుకు సిద్ధమని ప్రకటించారు. అయితే, ప్రతిపక్ష నేతగా కేసీఆర్ వస్తే.. ప్రభుత్వాధినేతగా తాను వస్తానని రేవంత్ చెప్పారు. రాష్ట్రానికి నిధుల కోసమైనా కేసీఆర్ ముందుకు రావాలన్నారు. మీరే తారీఖు డిసైడ్ చేయండి దీక్షకు మేం సిద్ధం. తెలంగాణకు మిగతా 2లో..

# రేవంత్ VS కేటీఆర్





## శాసనసభలో సీఎం రేవంత్, కేటీఆర్ మధ్య మాటల యుద్ధం..

- అవగాహనా రాహిత్యంతో కేటీఆర్ సభను తప్పుదోవ పట్టిస్తున్నారు..
- పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం దివాలా తీసింది
- తండ్రి పేరు చెప్పుకుని ఎదిగిన మంత్రిని కాదు..
- కిందిస్థాయి నుంచి ముఖ్యమంత్రినయ్యానని సీఎం రేవంత్ వ్యాఖ్య ఆగ్రహం
- యాచిస్తే ఏమీ రాదు.. శాసించి సాధించుకోవాలని కేటీఆర్ కౌంటర్
- కేసీఆర్‌ను కాదు.. దమ్ముంటే మోదీని తిట్టండి..
- ఏం చేసినా బహిరంగంగానే చేశాం..
- చీకటి ఒప్పొందాలు మాకు తెలీదు: కేటీఆర్

హైదరాబాద్ ప్రతినిధి, (నేటి ఫోకస్‌న్యూస్)–జూలై 24:

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై తెలంగాణ శాసనసభలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, భారాస ఎమ్మెల్యే కేటీఆర్ మధ్య మాటల యుద్ధం చోటు చేసుకుంది. అవగాహనా రాహిత్యంతో కేటీఆర్ సభను తప్పుదోవ పట్టిస్తున్నారని రేవంత్ అన్నారు. కీలకమైన చర్చ మిగతా 2లో..

## ఆర్టీసీపై వాడీవేడి చర్చ

- ఆర్టీసీపై రాజకీయం చేస్తున్న బీఆర్ఎస్
- మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ ప్రతినిధి, (నేటి ఫోకస్‌న్యూస్)–జూలై 24:

తెలంగాణ శాసనసభలో ఆర్టీసీపై వాడీవేడి చర్చ జరిగింది. ప్రశ్నోత్తరాల సమయంలో ఈ అంశంపై అధికారపక్షం నుంచి సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్.. ప్రతిపక్షం తరఫున భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడారు. ఈ క్రమంలో అధికార విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ “హరీశ్‌రావు సుదీర్ఘ కాలం మంత్రిగా పనిచేశారు. శాసనసభ మిగతా 2లో..

# నేడు రాష్ట్ర బడ్జెట్

- ప్రవేశపెట్టనున్న భట్టి విక్రమార్క

హైదరాబాద్ ప్రతినిధి, (నేటి ఫోకస్‌న్యూస్)–జూలై 24:

తెలంగాణ అసెంబ్లీలో ఆర్థికమంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. బుధవారం బడ్జెట్ అన్యాయాలపై చర్చించిన అనంతరం శాసనసభ నేటికి వాయిదా పడింది. మధ్యాహ్నం సభ తిరిగి ప్రారంభం కానుంది. మధ్యాహ్నం 12 గంటలకు డిప్యూటీ సీఎం, రాష్ట్ర ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. తర్వాత బడ్జెట్‌పై చర్చ జరగనుంది. మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి బడ్జెట్‌పై చర్చకు సమాధానం ఇచ్చే అవకాశం ఉంది.కాగా, శాసనసభలో బుధవారం తెంగాణకు అన్యాయం' అనే తీర్మానంపై చర్చ జరిగింది. అన్ని పార్టీల నేతలు ఈ తీర్మానంపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. బీఆర్ఎస్ తరఫున పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు అసెంబ్లీలో మాట్లాడారు. తీర్మానానికి వ్యతిరేకంగా బీజేపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు.



# కెసిఆర్ పోరాటం రామాయణమంత



- తెలంగాణ శాసించే స్థాయిలోనే ఉండాలి..
- యాచిస్తే కేంద్రం పట్టించుకోదు
- అనేక సందర్భాల్లో కేంద్రంతో పోరాడాం..:కేటీఆర్



హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–జూలై 23:

కేంద్రంపై కేసీఆర్ ప్రభుత్వం చేసిన పోరాటం రాసుకుంటే రామాయణమంతా.. చెప్పుకుంటే భారతమంత అని కేటీఆర్ అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై జరిగిన చర్చలో కేటీఆర్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'దేశ అత్యున్నత సభ పార్లమెంట్. ఏపీ పునర్విభజన చట్టం ఏదైతో ఉన్నదో అందులో రెండురాష్ట్రాలకు హామీ ఇచ్చారు. అటు ఆంధ్రా, ఇటు తెలంగాణకు హామీలు ఇచ్చారు. 35పైగా హామీలు ఇచ్చారు. ఒక రాష్ట్రానికి చేయూతనిచ్చి.. మరో రాష్ట్రానికి మొండిచేయిచూపడం అన్యాయం. పక్కవారు బాగుపడితే సంతోషపడుతాం. ఆంధ్ర రాష్ట్రానికి డబ్బులు ఇచ్చారు సంతోషం. మనకు ఇవ్వలేదనే తెలంగాణలోని ప్రతిబిడ్డలో ఉన్నది. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఇంత చిన్నచూపా అనే బాధ తప్పకుండా ఉన్నది. మిగతా 2లో..

# ఘోర విమాన ప్రమాదం

- టేకాఫ్ అవుతుండగా కూలిన విమానం
- 18 మంది మృతి.. నేపాల్‌లో ఘటన

కాఠ్‌మాండూ: నేపాల్‌లో ఘోర విమాన ప్రమాదం జరిగింది. శౌర్య ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం టేకాఫ్ అవుతున్న సమయంలో ప్రమాదవశాత్తూ కూలి పోయింది. రాజధాని నగరం కాఠ్‌మాండూలోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో బుధవారం ఉదయం 11గంటల ప్రాంతంలో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. కాఠ్‌మాండూ నుంచి పొఖారాకు బయల్దేరిన బాంబార్డియర్ సీఆర్‌జే 200 విమానం టేకాఫ్ అయిన క్షణాల్లోనే మిగతా 2లో..






# బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం

- కేంద్రం ఏమిచ్చింది.. గాడిద గుడ్డు!
- నగరంలో కాంగ్రెస్ ఫ్లెక్సీల వార్

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్):

కేంద్ర బడ్జెట్–2024లో తెలంగాణ రాష్ట్రాని అన్యాయం జరిగిందంటూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. 'కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు ఏమిచ్చింది..? గాడిద గుడ్డు' అంటూ మిగతా 2లో..

## బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర
# అన్యాయం

(మొదటి పేజీ తరువాయి..)

వినూత్న రీతిలో కాంగ్రెస్ నాయకులు ప్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఇటీవల జరిగిన లోక్ సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ 8ఎంపీ సీట్లు గెలిచిందని.. అయితే 8సీట్లు ఇచ్చిన రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్‌లో దక్కింది మాత్రం గాడిద గుడ్డు అంటూ బ్యానర్లపై పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని అనేక ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్లెక్సీలు అందరినీ ఆకర్షిస్తున్నాయి. దీనిపై ఇప్పటికే తీవ్రస్థాయిలో చర్చ మొదలైంది. బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్రానికి ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వకపోవ డంపై బీజేపీపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇప్పటికే ప్రధాని మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేశారంటూ సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు సహా రాష్ట్ర ప్రతిపక్షాలు సైతం మోడీ ప్రభు త్వంపై తీవ్రంగా విరుచుకుపడుతున్నారు. తెలంగాణ అంటే మీకెందుకంత ద్వేషం అని నిప్పులు చెరుగుతున్నారు. తెలంగాణపై వివక్ష చూపించారని, మాపై కేంద్ర ప్రభుత్వం కక్ష సాధిస్తున్నట్లు కనిపిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రధాని మోడీ తెలంగాణకు వచ్చినప్పుడు స్వయంగా వెళ్లి స్వాగతం పలికి మరి పెద్దన్న పాత్ర పోషించమని అడిగానని గుర్తు చేశారు. రాష్ట్రాన్ని చిన్నచూపు చూడడం సరికాదని మండిపడ్డారు. తాను మూడుసార్లు స్వయంగా ఢిల్లీకి వెళ్లి నిధులు ఇవ్వాలని మోడీని అడిగినట్లు రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. తమ నేతలు సైతం 18సార్లు కేంద్ర పెద్దలను కలిశారని అయినా చివరికి అన్యాయమే జరి గిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో తెలంగాణ పదాన్నే నిషేధించారని సీఎం రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వ తీరుపై రాష్ట్ర కాంగ్రెస్ నేతలు గుర్రుగా ఉన్నారు. తెలంగాణపై ఎందుకంత చులకన భావం అంటూ మండి పడుతున్నారు. గతంతో పోలిస్తే రాష్ట్రంలో భాజపాకు ఆదరణ పెరిగిందని అలాం టప్పుడు నిధులు కేటాయించకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్‌తో సమానంగా 8ఎంపీ సీట్లు ఇచ్చినా మీకు సరిపోలేదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విభజన హామీల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కి బడ్జెట్‌లో ప్రాధాన్యం కల్పించారని, అమరావతి అభివృద్ధికి రూ.15వేల కోట్లు కేటాయించారని చెప్పారు. మరి తెలంగాణ మీకు గుర్తు రాలేదా అంటూ కాంగ్రెస్ శ్రేణులు ప్రశ్ని స్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పదేపదే తెలంగాణకు వచ్చినప్పుడు రాష్ట్ర ప్రజలు గుర్తున్నారు కదా, మరి బడ్జెట్ కేటాయింపులు చేసేటప్పుడు ఆ ప్రజలు మీకు గుర్తు రాలేదా? అంటూ మోడీని ప్రశ్నిస్తున్నారు. మీరు చేసిన పనిని తెలంగాణ సమాజం గమనిస్తోందని కాంగ్రెస్ నేతలు హెచ్చరిస్తున్నారు.

## మంత్రి పదవి కోసం పైరవీలు అక్కర్లేదు

- కావాలనుకుంటే సిఎంనే అవుతా
- రాజగోపాల్ రెడ్డి ఆసక్తికర కామెంట్స్

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-జూలై 24:

రేవంత్ రెడ్డి కేబినెట్‌లో మంత్రి పదవి కోసం పైరవీలు చేయలేదని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. అయ్యేదుంటే ముఖ్యమంత్రి కావచ్చునని ఆయన పేర్కొన్నారు. బుధవారం తెలంగాణ అసెంబ్లీ లాబీలో మాజీ మంత్రులు, బీఆర్ఎస్ పార్టీ నేతలు ప్రశాంత్ రెడ్డి, మల్లారెడ్డి, గంగుల కమలకర్, పల్లా రాజేశ్వర్‌రెడ్డితో రాజగోపాల్‌రెడ్డి సంభాషించారు. ఈ సందర్భంగా వారి మధ్య ఆసక్తికర సంభాషణ చోటు చేసుకుంది. ఆ క్రమంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. గేమ్ ఇప్పుడు స్టార్ట్ అయిందన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన మాజీ మంత్రి ఒకరు జైలుకు వెళ్లే వారి జాబితాలో తొలి స్థానంలో ఉందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి వేముల ప్రశాంత రెడ్డి లాంటి వారిని తాము కొనుగోలు చేయలేమన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్... రూ. 20, రూ. 30 కోట్లు ఇచ్చి రేటు ఎక్కువ పెట్టి కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేశారని రాజగోపాల్ రెడ్డి గుర్తు చేశారు. కానీ తాము మాత్రం రూ.5, రూ. 10 కోట్లకు మాత్రమే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అడుగుతున్నామని చెప్పారు. అందుకే ఇంకా 26 మంది ఎమ్మెల్యేలు తమతో టచ్‌లోకి రాలేదని స్పష్టం చేశారు. ఇక గతంలో జరిగిన మునుగోడు ఉప ఎన్నికల్లో రూ.300 కోట్లు ఖర్చు చేసి బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించిందని తెలిపారు. మహాభారతంలో కర్ణుడిని ఓడించినట్లు తనను ఆ ఉప ఎన్నికల్లో ఓడించారన్నారు. అయితే మునుగోడు ఉప ఎన్నికల ఎఫెక్ట్ బీఆర్ఎస్‌పై తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల వేళ పడిందన్నారు. అందుకే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధికారాన్ని కోల్పోయారని ఆయన సోదాహరణగా వివరించారు.

## మాజీ ఎమ్మెల్సీ దిలీప్‌పై కేసు నమోదు

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-జూలై 24:

మాజీ ఎమ్మెల్సీ దిలీప్ కుమార్, ప్రవీణ్ కుమార్ రెడ్డి అనే దళారి మోసం చేశారంటూ బాధితుడు శశిధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. సెన్సార్ బోర్డు మెంబర్‌గా అవకాశం కల్పిస్తానంటూ ప్రవీణ్ రెడ్డి అనే వ్యక్తి రూ.10లక్షలు వసూలు చేశారంటూ బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ముందుగా రూ.4లక్షలు ఇచ్చానని, అనంతరం మరో రూ.6లక్షలు ఇచ్చినట్లు చెప్పుకొచ్చారు. నగదు తీసుకున్న తర్వాత సెన్సార్ బోర్డు కాదు, ఎఫ్‌సీ నంబర్‌గా అవకాశం కల్పిస్తామని, అందుకు మరో రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు బాధితుడు వెల్లడించారు. కేంద్ర మంత్రులు జయంత్ చౌదరి, పెమ్మసాని చంద్రశేఖర్, హిమాచల్ గవర్నర్ బండారు దత్తాత్రేయతో పరిచయాలు ఉన్నాయంటూ తనను మోసం చేసినట్లు శశిధర్ ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా ఏపీకి చెందిన ఉన్నతస్థాయి అధికారులతోనూ సంబంధాలు ఉన్నట్లు నిందితులు చెప్పారని గోడు వెల్లబోశారు. ÷ఔ.10లక్షలను మాజీ ఎమ్మెల్సీ దిలీప్ కుమార్ బంధువు అకౌంట్‌లో వేసినట్లు చెప్పారు. గతంలోనూ ఎమ్మెల్యే టికెట్ ఇప్పిస్తానని షాద్ నగర్‌కి చెందిన ఓ నేత నుంచి ప్రవీణ్ రెడ్డి కోటి రూపాయలు వసూలు చేసినట్లు బాధితుడు పేర్కొన్నారు. నిందితులు అనేక మందికి ఇలాగే పదవులు ఆశ చూపి డబ్బులు వసూలు చేయడమే పనిగా పెట్టుకున్నట్లు ఆరోపించారు. ఘటనపై విచారణ చేసి న్యాయం చేయాలంటూ ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు విచారణ చేపట్టారు.

## ఆగస్ట్ 2వరకు అసెంబ్లీ సమావేశాలు

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-జూలై 24:

తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఆగస్టు 2 వరకు కొనసాగనున్నాయి. ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ముందుగా 31 వరకే జరపాలనుకున్నా, అనేక అంశాలు చర్చించాల్సి ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. గురువారం అసెంబ్లీలో డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈనెల 26న అసెంబ్లీకి సెలవు, 27న బడ్జెట్ పద్దుపై చర్చ జరగనుంది. 28న ఆదివారం సెలవు ఉంటుంది. 29, 30 తేదీల్లో వివిధ బిల్లులు ప్రవేశపెట్టనున్నారు. 31న ద్రవ్యవినిమయ బిల్లు సభ ముందుకు తీసుకురానున్నారు.

# రేవంత్ వర్సెస్ కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి..)

జరుగుతున్నప్పుడు కేసీఆర్ ఎందుకు రాలేదని సీఎం ప్రశ్నించారు 'మాకు జవాబు చెప్పండి చాలు. మీకు కేసీఆర్ అవసరం లేదు' అని కేటీఆర్ వ్యాఖ్యానించడంతో సీఎం రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ "తండ్రి పేరు చెప్పుకొని నేను మంత్రిని కాలేదు. కింది స్థాయి నుంచి ఎదిగి ముఖ్యమంత్రిని అయ్యా. కేటీఆర్‌ది మేనేజ్‌మెంట్ కోటా అనుకున్నా. అంతకంటే దారుణం" అని అన్నారు. ఆ వెంటనే కేటీఆర్ స్పందిస్తూ 'రేవంత్ పేమెంట్ కోటాలో సీఎం అయ్యారని మేమూ అనొచ్చు' అని వ్యాఖ్యానించారు. దానికి రేవంత్ మళ్లీ కౌంటర్ ఇస్తూ 'పేమెంట్ కోటాలో సీఎంను కాలేదు. మొన్న భారాస నేతలు దిల్లీ వెళ్లి చీకట్లో మాట్లాడుకొని వచ్చారు' అని వ్యాఖ్యానించారు. కేటీఆర్ స్పందిస్తూ "మేనేజ్‌మెంట్ కోటాలో మంత్రి అయ్యానని సీఎం అనొచ్చా? సభా నాయకుడు అలా మాట్లాడొచ్చా?" అని ప్రశ్నించారు.

**పదేళ్ల భారాస పాలనలో రాష్ట్రం దివాలా: రేవంత్‌రెడ్డి**

ఆ తర్వాత మళ్లీ సీఎం రేవంత్ మాట్లాడుతూ కేసీఆర్‌పై విమర్శలు చేశారు. "మాకేమీ అక్కర్లేదు.. మీ ప్రేమ చాలని చెప్పిన మనిషి కేసీఆర్. విద్యుత్‌పై రాష్ట్రంలో ఇప్పటివరకు ఒక విధానమే లేదు. రూ.7లక్షల కోట్ల అప్పు చేసి వెళ్లిపోయారు. భారాస పదేళ్ల పాలనలో రాష్ట్రం దివాలా తీసింది. గత ప్రభుత్వ పరిపాలనలో విద్యుత్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. మీరేం చేశారో చూశాకే ప్రజలు తీర్పు ఇచ్చారు. భారాసకు అసెంబ్లీలో వచ్చిన మెజారిటీ లోక్‌సభ ఎన్నికల్లో రాలేదు. లోక్‌సభలో గుండుసున్నా దక్కినా తీరు మారకుంటే ఎలా?ఇప్పటికైనా రాష్ట్ర ప్రజల హక్కుల కోసం మాట్లాడాలని కోరుతున్నా" అని సీఎం అన్నారు.

**యాచిస్తే ఏమీ రాదు.. శాసించి సాధించుకోవాలి: కేటీఆర్**

అనంతరం కేటీఆర్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన చర్చను సమర్థిస్తున్నట్లు తెలిపారు. "విభజన సమయంలో తెలంగాణ హక్కుల కోసం ఎంతో పోరాడాం. మోదీ సర్కారుపై తెలంగాణ కోసం అనేక పోరాటాలు చేశాం. రాష్ట్ర హక్కులు ఎవరు హరించినా వారి మెడలు వంచుతాం. యాచిస్తే ఏమీ రాదు.. శాసించి సాధించుకోవాలి. దిల్లీ తత్వం ఇంతకాలానికి కాంగ్రెస్‌కు బోధపడింది. భాజపాకు వ్యతిరేకంగా మాట్లాడుతుంటే మీకేం ఇబ్బంది? కేంద్ర వివక్షను ఎండగట్టడంలో మేం సహకరిస్తాం. గతంలో కేంద్రం సాయం చేయకపోయినా ఎంతో అభివృద్ధి చేశాం. రేవంత్ రెడ్డి కష్టపడే ఈ స్థాయికి చేరుకున్నారు. చిన్నవయసులోనే సీఎం అయ్యారు. కేంద్రం తెచ్చిన అన్ని బిల్లులకూ మేం మద్దతివ్వలేదు. దళితుడు రాష్ట్రపతి, తెలుగు బిడ్డ ఉపరాష్ట్ర అభ్యర్థులుగా అయ్యే సమయంలో మద్దతిచ్చాం. కేసీఆర్‌ను కాదు.. ధైర్యముంటే మోదీని తిట్టండి. ఎన్నికలకు ఆరు నెలల ముందు రాజకీయాలు చేద్దాం. ఎన్నికల తర్వాత నాలుగున్నరేళ్లు ప్రజల గురించి ఆలోచిద్దాం. ఏం చేసినా బహిరంగంగానే చేశాం.. చీకటి ఒప్పందాలు మాకు అలవాటు లేదు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఏమీ ఇవ్వకుంటే మేమేం చేస్తాం?" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

**మాకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం: భట్టి**

తమకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. "హైదరాబాద్ పవర్ సర్కిల్‌ను ప్రైవేటు వాళ్లకు ఇస్తున్నట్లు ఎక్కడా చెప్పలేదు. ఎవరో పత్రికల్లో రాసినదాన్ని పట్టుకుని సభలో మాట్లాడితే ఎలా? కేటీఆర్ సభతోపాటు రాష్ట్రాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారు. భారాస వాళ్లలా ఏది పడితే అది చేసేవాళ్లం కాదు. సింగరేణి అంశంపై చర్చించేందుకు మేం సిద్ధం" అని భట్టి స్పష్టం చేశారు.

# ఆర్టీసీపై వాడీవేడి చర్చ

(మొదటి పేజీ తరువాయి..)

వ్యవహారాల మంత్రిగానూ వ్యవహరించారు. ఆర్టీసీ కార్మికుల తరఫున మాట్లాడేందుకు సీపీఐ సభ్యుడికి సభాపతి అవకాశం ఇచ్చారు. ఆ పార్టీకి ఛాన్స్ ఇవ్వడాన్ని భారాస సభ్యుడు హరీశ్‌రావు ప్రశ్నించడం, స్పీకర్‌పై వ్యాఖ్యలు చేయడం సరికాదు. ప్రశ్న అడిగిన వారికే మాట్లాడే అవకాశం ఇవ్వాలని ఎక్కడా లేదు. ఎవరికి ఇవ్వాలనేది స్పీకర్ విచక్షణ. ఆర్టీసీని ఆదుకునేందుకు ప్రభుత్వం నిర్దిష్ట ప్రణాళికతో ఉంది. ఒక కార్మిక నేతను తొలగించేందుకు సంఘాలనే గత ప్రభుత్వం రద్దు చేసింది. సభను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించవద్దని భారాస నేతలకు మనవి చేస్తున్నా" అని అన్నారు. అంతకుముందు హరీశ్‌రావు మాట్లాడుతూ "ఆర్టీసీలో ఖాళీగా ఉన్న పోస్టులను ఎప్పుడు భర్తీ చేస్తారు? ఆర్టీసీని ప్రభుత్వంలో ఎప్పుడు విలీనం చేస్తారు? విలీనంపై ఎప్పటిలోగా అపాయింట్‌మెంట్ డేట్ ప్రకటిస్తారు?" అని ప్రశ్నించారు.

**ఆర్టీసీపై రాజకీయం చేస్తున్న భారాస: పొన్నం ప్రభాకర్**

అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానం ఇస్తూ గత ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఆర్టీసీ అంశాన్ని భారాస రాజకీయం చేస్తోందని వ్యాఖ్యానించారు. "యూనియన్లను రద్దు చేసి.. ఇప్పుడు పునరుద్ధరించాలని మాట్లాడుతున్నారు. ఆర్టీసీ కార్మికులు 50 రోజులు సమ్మె చేసినా గతంలో పట్టించుకోలేదు. ఆర్టీసీ సొమ్మును గత ప్రభుత్వం వాడుకుంది. ఆ సంస్థకు మేం నెలకు రూ.300 కోట్లు ఇస్తున్నాం. ఆర్టీసీకి కొత్త బస్సులు కొంటున్నాం. కొత్తగా 3,035 మంది ఉద్యోగులను నియమిస్తున్నాం. పని భారం పెరిగినా ఆర్టీసీ కార్మికులు బాగా పని చేస్తున్నారు. వారిని అభినందిస్తున్నా. ఆర్టీసీకి ఇవ్వాల్సిన బకాయిలను మేం చెల్లించాం. ఆర్టీసీ కార్మికులపై భారాస నేతలు మొసలి కన్నీరు కారుస్తున్నారు. వారి సంక్షేమం మా బాధ్యత" అని చెప్పారు.

## ఘోర విమాన
# ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి..)

కూలిపోయింది. దీంతో మంటలు చెలరేగి విమానం దగ్ధమైంది. ప్రమాద సమయంలో విమానంలో సిబ్బందితో సహా 19మంది ఉన్నారు. ఈ ఘటనలో 18మంది మృతిచెందగా.. పైలట్ తీవ్రంగా గాయపడినట్లు తెలుస్తోంది. ప్రమాదంపై సమాచారం అందిన వెంటనే సహాయక సిబ్బంది రంగంలోకి దిగారు. గాయపడిన పైలట్‌ను విమా నం నుంచి బయటకు తీసి, ఆసుపత్రికి తరలించారు. రన్‌వేపై నుంచి విమానం కూలుతున్న దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

## పదేళ్ల తర్వాత అసెంబ్లీలో ప్రజాస్వామ్యం

- సమస్యలపై చర్చించేలా అవకాశం: మంత్రి సీతక్క

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-జూలై 24:

పదేళ్ల తర్వాత అసెంబ్లీలో ప్రజాస్వామ్యం కనిపిస్తోందని, బీఆర్ఎస్ హయంలో శాసనసభలో ప్రొటెస్ట్ చేస్తే సస్పెండ్ చేసే వారని, తెలంగాణ ఏర్పడిందే నియామకాల మీదని అలాంటి నియామకాలపై అధికారంలో వున్నపుడు బీఆర్ఎస్ స్పందించలేదని మంత్రి సీతక్క ఆరోపించారు. బుధవారం అసెంబ్లీ లాబీలో మంత్రి మీడియాతో చిట్ చాట్‌గా మాట్లాడారు. కాంగ్రెస్ అధికారం రాగానే 30 వేల ఉద్యోగాలతో పాటు, జాబ్ నోటిఫికేషన్‌లు ఇచ్చామన్నారు. అధికారం పోయాక బీఆర్ఎస్ నేతలకు నిరుద్యోగులు గుర్తుకు వచ్చి ప్రొటెస్ట్ చేయటం హాస్యాస్పదంగా ఉందన్నారు. పదేళ్లుగా ఉద్యోగాల భర్తీని పట్టించుకోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ కోసం డిమాండ్ చేయడం విడ్డూరమన్నారు. అసెంబ్లీ పోడియంలోకి వెళ్లినా.. ప్లకార్డులు ప్రదర్శించినా.. గత ప్రభుత్వం సస్పెండ్ చేసేదని.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అలా చేయడంలేదని మంత్రి సీతక్క అన్నారు. గతంలో నిరసనలను అణగదొక్కిన బీఆర్ఎస్.. ఇప్పుడు నిరసనకు దిగడం ఆశ్చర్యకరమన్నారు. బీఆర్ఎస్ నిరసనలతో రాష్ట్రంలో ఎంత ప్రజా స్వామ్యం వుందో అర్థం అవుతుందని, ఉద్యోగాల భర్తీలో వున్న చిక్కు ముడులను విప్పి నియామకాలు చేపట్టామని చెప్పారు. త్వరలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్నారామె. తండాల్లో జీవన ప్రమాణాలు మెరుగయ్యేలా చర్యలు చేపడుతున్నామని, తండాలను రెవెన్యూ గ్రామాలుగా మార్చే అంశం చర్చిస్తున్నామన్నారు. 1936 నాటి రెవెన్యూ గ్రామాలే ఇంకా కొనసాగుతున్నాయని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. కాగా దివ్యాంగులపై ఐఏఎస్ అధికారిణి స్మితా సభర్వాల్ చేసిన వ్యాఖ్యలు సరికాదని, దివ్యాంగులను కించపరిచేలా ఉన్నాయని.. దీని వెనుక వేరే ఆలోచన కనిపిస్తోందని మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐఏఎస్ అధికారిణి స్మితా సభర్వాల్‌లో ఫ్యూడల్ భావజాలం ఉందని, ఆమె తన ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలని సూచించారు. దేవుడు ఇచ్చిన జన్మకు ఎవరు ఏం చేస్తారన్నారు. ఇప్పటికైనా అలాంటివి మానుకోవాలన్నారు. దివ్యాంగులుగా ఉన్న ఎంతోమంది గొప్ప స్థానాలకు వెళ్లారని, ఇతరుల సమర్థతను గుర్తించాలన్నారు. ఈ విషయం సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

## జియాగూడలో విషాదం

- అగ్ని ప్రమాదంలో తండ్రీకూతుళ్ల మృతి

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-జూలై 24:

హైదరాబాద్ పాతబస్తీ జియాగూడలోతీవ్ర విషాదం చోటుచేసుకున్నది. మంగళవారం అర్థరాత్రి దాటిన తర్వాత జియాగూడలోని వెంకటేశ్వరనగర్ ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తండ్రీ కూతుళ్లు మృతిచెందారు. అపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న ఫర్నీచర్ ఫ్యాక్టరీలో ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. గమనించిన స్థానికులు మంటలను మార్పాలనుకునేలోపే పై అంతస్తులకు వ్యాపించాయి. దీంతో సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. పై అంతస్తుల్లో చిక్కుకుపోయిన ఏడు కుటుంబాల వారిని రక్షించారు. అయితే రెండో సఅంతస్తులో ఉన్న ఒకే కుటుంబానికి చెందిన నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని పోలీసలు ఉస్మానియా దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పదేండ్ల బాలిక శివప్రియ మరణించగా, మరికొద్ది సేపటికే ఆమె తండ్రి శ్రీనివాస్ కూడా మరణించారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

## సింగరేణిని ప్రవేటీకరించం: కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, (నేటి ఫోకస్‌న్యూస్)-జూలై24:

సింగరేణిని ప్రవేటీకరించే ప్రసక్తే లేదని కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో స్పష్టం చేసింది. ప్రశ్నోత్తరాల సందర్భంగా సింగరేణి ప్రైవేటీకరణపై పెద్దపల్లి ఎంపీ వంశీ ప్రశ్నించారు. ఈ సందర్భంగా మంత్రి కిషణ్ రెడ్డి ఈ మేరకు సమాధానం ఇచ్చారు. దేశంలో ఏ బొగ్గుగనినీ ప్రైవేటుపరం చేసే ఆలోచన తమ ప్రభుత్వానికి లేదని చెప్పారు.ప్రైవేటీకరణ చేయాలంటే 51 శాతం వాటా ఉన్న రాష్ట్ర నిర్ణయమే కీలకని చెప్పారు. సింగరేణి ప్రైవేటీకరణ అంశం రాష్ట్ర ప్రభుత్వ చేతుల్లోనే ఉందని వెల్లడించారు. ఒడిశాతో చర్చించి సింగరేణికి ఒక గనిని కేటాయించామని తెలిపారు. సింగరేణికి కేంద్రం నుంచి పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

## ఢిల్లీలో దీక్షకు సిద్ధం

(మొదటి పేజీ తరువాయి..)

నిధులు తెచ్చుడో..సచ్చుడో తేల్చుకుందామని సవాల్ విసిరారు. చావు నోట్లో తల పెట్టి తెలంగాణ తెచ్చామని మేమెప్పుడూ పదే పదే చెప్పలేదు. రూ.100 పెట్టి పెట్రోల్ కొన్నారు కానీ, అగ్గిపెట్టి కొనలేదు. అగ్గిపెట్టి మర్చిపోయినట్టు నటించి అమాయక విద్యార్థులను బలిగొనలేదు అని రేవంత్‌రెడ్డి విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయంపై శాసనసభలో చర్చ సందర్భంగా అధికార, ప్రతిపక్ష నేతల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. పరస్పర విమర్శలతో సభ వేడెక్కింది. 'కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం' అనే అంశంపై రాష్ట్ర శాసనసభలో ఇవాళ చర్చ సందర్భంగా అన్ని పార్టీలు తమ అభిప్రాయాలను వెల్లడించాయి. బీఆర్ఎస్ తరఫున కేటీఆర్ ఇప్పటికే మాట్లాడారు. అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టడానికి ప్రభుత్వం సరైన విధానాన్ని పాటించలేదని విమర్శించారు. అనంతరం తీర్మానంపై తన అభిప్రాయాన్ని వినిపించారు. ఆ తర్వాత మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు. తెలంగాణకు అన్యాయంపై రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన తీర్మానాన్ని తాము ఏకగ్రీవంగా ఆమోదిస్తామని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందనే విషయం వాస్తవమని హరీశ్‌రావు అన్నారు. ఈ అన్యాయంపై రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్తామంటే వచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. అంతేకాదు, బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి చూపినందుకు నిరసనగా సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో దీక్ష చేస్తానంటే తాము మద్దతిస్తామని చెప్పారు. అయితే అందుకు సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెబుతూ.. మాజీ సీఎం కేసీఆర్ ఢిల్లీ దీక్షకు వస్తానంటే తాను తప్పకుండా దీక్ష చేస్తానని అన్నారు. ఇదిలావుంటే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో పెట్టిన తీర్మానాన్ని నిరసిస్తూ బీజేపీ ఎమ్మెల్యేలు సభ నుంచి వాకౌట్ చేశారు.

## కెసిఆర్ పోరాటం
# రామాయణమంత

(మొదటి పేజీ తరువాయి..)

తెలంగాణ హక్కులను ఎవరు హరించినా.. ఎవరు ఇబ్బంది పెట్టినా తెలంగాణ ప్రయోజనాల విషయంలో వారి మెడలు వంచే బాధ్యత.. తెలంగాణ కోసమే పుట్టిన పార్టీగా.. తెలంగాణ గడ్డపై పుట్టిన పార్టీగా బీఆర్ఎస్‌దేనన్న మాట గుర్తు చేస్తున్నాను. కేసీఆర్ పోరాట పటిమ.. చేసిన కార్యక్రమాలు చెప్పాల్సి వస్తే.. పదేళ్లు కేంద్రంపై చేసిన ప్రయత్నాలు చెప్పాల్సి వస్తే రాసుకుంటే రామాయణమంతా.. చెప్పుకంటే భారతమంతా అంత కథ ఉన్నది. తప్పకుండా తీసుకురావాల్సిన బాధ్యత మామీద ఉన్నదని భావిస్తున్నాం' అన్నారు. రాష్ట్రం ఏర్పడ్డదో లేదో.. సీఎంగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేయకముందే తెలంగాణలోని ఏడుమండలాలను ఆర్డినెన్స్ ద్వారా ఆనాడు పోలవరం ముంపులో ఆంధ్రాలో కలిపితే మొట్టమొదటిగా స్పందించింది.. రాష్ట్రం బంద్‌కు పిలుపునిచ్చింది.. ఆ నాటి మా పార్టీయే. ప్రభుత్వం ఏర్పాటు చేయకపోయినా కొట్లాడింది మేమే. 2014, సెప్టెంబర్ 7న కేసీఆర్ ప్రధానిని కలిసి తెలంగాణ ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వండి.. హోదా ఇవ్వండని కోరారు. ఒకసారి కాదు 1.15లక్షల కోట్లు రాష్ట్రానికి ఇవ్వాలని సీఎంగా కేసీఆర్ ఆ నాడు 2016 ఫిబ్రవరి 12లో కోరారు. ఇలా ఎన్నో సందర్భాల్లో కలిశాం. ఒక్కసారి కాదు.. ఎక్కని కొండ లేదు.. మొక్కని బండలేదు అన్నట్లు ప్రతి ప్రాజెక్టు విషయంలో కేంద్రం వద్దకు పలుసార్లు పోయాం. కొన్ని సాధించాం.. కొన్ని సాధించలేకపోయాం. రకరకాల ప్రయత్నాలు చేశాం. వివక్షపూరిత వ్యవహారం చేసినప్పుడు సీఏఏ, ఎన్‌పీఏ, ఎన్ఆర్‌సీలాంటి విషయాల్లో తెలంగాణ శాసనభలో తీర్మానాలు ప్రవేశపెట్టి పాస్ చేసి కేంద్రానికి నిరసన తెలిపాం. విద్యుత్ చట్టం తెచ్చి మోటార్లకు మీటర్లు పెట్టాల్సిందేనని మెడపై కత్తిపెడితే దాన్ని వ్యతిరేకిస్తూ సభలో తీర్మానం చేశాం. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ విషయంలో నిరసన తెలిపాం. ఈ సందర్భంగా ప్రసంగానికి భట్టి విక్రమార్క అడ్డు తగిలారు. దీనికి స్పందిస్తూ వివక్ష ఇవాల్సింది కాదు పదేళ్లది' అన్నారు. పెండింగ్ సమస్యలను పరిష్కరించాలన్నా లెక్కలేదు. ఓబీసీ గణన కావాలని స్టేట్ అసెంబ్లీలో తీర్మానం చేసి పంపాం. ఆఖరికి కేంద్రం రైతుచట్టాలు రైతులకు వ్యతిరేకంగా చేస్తే పార్లమెంట్‌లో నిరసన తెలిపాం. బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడితే మీకెందుకు ఇబ్బంది ? ఏం చెప్పాలో పంపండి. మాట్లాడుతాం. ఏం మాట్లాడాలో మీరే చెబుతారా? ఇది టూమచ్. నేను సీనియర్ సభ్యుడిని. ఐదుసార్లు గెలిచివచ్చాను. ఏం మాట్లాడాలో తెలుసు. హౌస్‌లో ఎలా ఉండాలో తెలుసు. ఈ రకంగా డిక్టేట్ చేయడం సరికాదు. మా పార్టీ పరంగా గతపదేళ్లు ప్రభుత్వంలో కేంద్రం ధాన్యం కొనుగోలు చేయనంటే మొత్తం కేబినెట్ సీఎంతో సహా.. నూకలు తినండి అంటే ఢిల్లీలో ధర్నా చేసి వచ్చిన వాళ్లం. మాకు ఏం కొత్తకాదు. రాష్ట్రపతి ప్రసంగాన్ని బహిష్కరించింది టీఆర్ఎస్ ఎంపీలు. బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీలో ఇక్కడ మాత్రమే కాకుండా ఢిల్లీలో నిరసన తెలిపింది మా ఎంపీలే'నన్నారు. కంటోన్మెంట్ విషయంలో కేంద్రం ఇబ్బందిపెడుతుంటే వాటిని లేవనెత్తింది మేమే. కోటి ఆశలతో ఏర్పడిన ఈ రాష్ట్రంలో కేంద్ర బడ్జెట్‌లో నిన్న అన్యాయం జరిగింది. రేవంత్‌రెడ్డి చిన్న వయసులోనే సీఎం అయ్యారు. కష్టపడి వచ్చారు. సంతోషం. రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు. ఉత్సాహంగా చాలా ఉత్సాహంగా ప్రధానిని, కేంద్రమంత్రులను కలిశారు. కలిసి ఎన్నో విజ్ఞాపనలు చేశారు. మేం ఇచ్చినట్లే మీరు రేవంత్‌రెడ్డి వినపత్రాలు ఇచ్చారు. కానీ, న్యాయం మీకు జరుగలేదు. మేం మొదటి చెప్పేది అదే. ప్రొఫెసర్ జయశంకర్ ఎప్పుడూ చెప్పేవారు. యాచిస్తే రాదు తెలంగాణ.. శాసిస్తే తెలంగాణ వస్తది చెప్పేవారు. ఇప్పుడు కూడా అదే చెబుతున్నాం. శాసించే స్థితిలో తెలంగాణ ఉండాలి. ఆనాడు సహకారం అందించినా,.. సమరం సాగించినా తెలంగాణ ప్రయోజనాలకే. ఏ రకమైన లాలూచి.. వ్యక్తిగత ప్రయోజనాల కోసం రాజీపడలేదు. ఏడుమండలాలు గుంజుకున్నప్పుడు నిరసించింది మేమే.. నిరసన తెలిపింది మేమే. పదేళ్లలో ఐదేళ్లు కేంద్రంలో ఎంపీగా ఉన్నారు. ఒక్కరోజు గొంతు విప్పారా? తెలంగాణ రాష్ట్రం రావాల్సిన హక్కుల గురించి పార్లమెంట్‌లో ప్రసంగించారా? అంటూ నిలదీశారు. కేటీఆర్ ప్రసంగానికి స్పీకర్ మాట్లాడుతూ.. తీర్మానంపై మాట్లాడాలని సూచించగా.. తీర్మానం ఎక్కడ పెట్టారని ప్రశ్నించారు. నోటిమాటలతో తీర్మానాలు కావాన్నారు. చర్చపై మాట్లాడుతున్నాం. మీరు రాసిస్తే అదే చదువుతా. చర్చలో పాల్గొని మాట్లాడున్నాం. హైకోర్టు విభజన కూడా పోరాటాలతోనే సాధించాం. కృష్ణా జలాల విషయంలో ట్రిబ్యునల్ తేల్చాలని.. రెఫర్ చేయాలంటే పదేళ్ల వెంటపడితే.. చివరకు కేసీఆర్ గట్టిగా నిలదీస్తే మొన్న ట్రిబ్యునల్‌కు రెఫర్ చేశారు. మేం సాధించిన అతిపెద్ద విజయం. అందుకే శాసించి సాధించుకోవాలి తప్పా.. యాచిస్తే కేంద్రం లొంగదు' అన్నారు.





# అమ్మ మాట.. అంగన్వాడి బాట..

◆ మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు

ఉమ్మడి మహబూబ్నగర్ ప్రతినిధి (నేటి ఫోకస్ న్యూస్) చారకొండ వెంకటేష్, జూలై 24:

అచ్చంపేట పట్టణంలోని పెద్దమ్మ గుడి ఆవరణలోని యాదవుల కమిటీ హాల్లో ఏర్పాటుచేసిన అమ్మ మాట... అంగన్వాడి బాట... కార్యక్రమం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ గార్లపాటి శ్రీనివాసులు హాజరయ్యారు. అదే విధంగా సిడిపిఓ దమయంతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండున్నర సంవత్సరాలు నిండిన పిల్లలకు ప్రాథమిక విద్య అవలంబించే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. అంగన్వాడి కేంద్రంలో పిల్లలకు పౌష్టికాహారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, సూపర్వైజర్లు, ఆర్ పి ఎస్ లు, చిన్నారుల తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్ జన్మదిన సందర్భంగా వెయ్యి మంది

# మహిళలకు చీరల పంపిణీ

## కేటీఆర్ జన్మదిన పురస్కరించుకొని మొక్కలు నాటి, కేక్ కట్ చేసి సంబరాలు





ఫోకస్ న్యూస్, ఓల్డ్ బోయిన్ పల్లి కంటోన్మెంట్ జూలై 24:

ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ లోని మాజీ మంత్రి, శాసనసభ్యులు కేటీఆర్ జన్మదిన వేడుకలను, కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముద్దం నరసింహ యాదవ్ మాట్లాడుతూ... కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు కేటీఆర్ జన్మదిన వేడుకల సందర్భంగా, డివిజన్ లోని మొక్కలు నాటి, భాగ్యశ్రీ గార్డెన్ లో పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి భారీ కేకు కట్ చేసిన అనంతరం, వెయ్యి మంది మహిళలకు చీరలను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. కేటీఆర్ ఐటీ శాఖ మంత్రిగా ఉండి హైదరాబాద్ నగరాన్ని ఎంతో అభివృద్ధి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నరేందర్ గౌడ్, కర్రె లావణ్య జంగయ్య, మక్కల నర్సింగ్ రావు, హరినాథ్, మన్నే ఉదయ్ యాదవ్, సయ్యద్ ఇజాజ్ బాయ్, గడ్డం నర్సింగ్ రావు, మల్లేష్ యాదవ్, మిరాజ్ భాయ్, లలిత గౌడ్, మట్టి శ్రీనివాస్, బుర్రి యాదగిరి, సీనియర్ కార్యకర్తలు పోచయ్య, పిట్ల రాజు, రాజు గౌడ్, సలీమ్ బాయ్, ఇబ్బు, రోజా, శశికళ, పద్మ, స్వరూప, దుర్గా, దేవి, సంతోషి, రాజ్ కుమారి పాల్గొన్నారు.

# కేటీఆర్ జన్మదిన సందర్భంగా వివిధ వార్డులలో సేవా కార్యక్రమాలు

◆ గజ్జల నాగేష్ ఆధ్వర్యంలో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

ఫోకస్ న్యూస్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ జూలై 24:

తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు జన్మదినాన్ని పురస్కరించుకొని, కంటోన్మెంట్ నియోజకవర్గంలో తెలంగాణ స్టేట్ బేవరేజ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జలనాగేష్ ఆధ్వర్యంలో ఉదయం గ్రీన్ ఇండియా ఛాలెంజ్లో భాగంగా వాహిని నగర్ లో మొక్కలు నాటారు. 3వ వార్డు కారానాలోని మథర్ థెరిసా అనాథాశ్రమంలో ఐసీయూ యూనిట్, వేడి నీళ్ల యూనిట్, ఈ.సి.జి యూనిట్, దుప్పట్లు, నైటీలు, మందుల పంపిణీతో పాటు పౌష్టికాహారం అందచేశారు. అనంతరం 2వ వార్డు రసుల్ పురలో మైనార్టీ నాయకులు అబ్బు, యాసన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గజ్జలనాగేష్ పాల్గొన్నారు. కంటోన్మెంట్ పరిశుద్ధ కార్మికులకు రైన్ కోర్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గజ్జల నాగేష్ మాట్లాడుతూ... అమలు కాని ఆమెతో ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఎవరు నమ్మరని, వచ్చే సాధారణ ఎన్నికల్లో మరోసారి తెలంగాణలో గులాబి జెండాను ఎగరవేయడం తధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు రావుల సతీష్, మైనార్టీ నాయకులు అబ్బు, యాసిన్, షర్ము, యాదగిరి, శ్రీనివాస్, శివ యాదవ్, సాయి కిరణ్, సంతోష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.







# యువతను విస్మరించిన కేంద్ర బడ్జెట్

◆ నిరుద్యోగ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపని కేంద్రం

◆ డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సైదులు

ఉమ్మడి మహబూబ్నగర్ ప్రతినిధి, (నేటి ఫోకస్ న్యూస్)-చారగొండ వెంకటేష్, జూలై 24:



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో యువతను పూర్తిగా విస్మరించిందని భారత ప్రజాతంత్ర యువజన సమైక్య డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వర్ధ%శీ% సైదులు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ... నిరుద్యోగ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేదని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు కల్పన హామీ పదేండ్ల పాటు బిజెపి ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వచ్చిన ఈ కేంద్ర బడ్జెట్లో ఉపాధి కల్పన గురించి ప్రస్తావించకుండా యువతని మరోసారి మోసం చేసిందని కేంద్ర ప్రభుత్వాన్ని క్షేత్రస్థాయిలో విమర్శించారు. నిరుద్యోగ సమస్యను ఎదుర్కోవాలంటే ప్రతి ఏటా దాదాపు 78.51 లక్షల ఉద్యోగాలను సృష్టించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆర్థిక శాఖ సర్వే సూచించిందని గుర్తించారు. కేంద్ర ప్రభుత్వం శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని సైదులు డిమాండ్ చేశారు .బీజేపీ ప్రభుత్వం దాని మిత్ర ప్రక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు కేంద్ర బడ్జెట్లో ప్రాధాన్యత కల్పించారని ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు అన్యాయం జరిగిందని తెలిపారు. విభజన హామీల అమలుకు బడ్జెట్లో నిధులు కేటాయించలేదని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఆలోచన చేసి వెనుకబడిన రాష్ట్రాలకి బడ్జెట్ కేటాయించి రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే నిరుద్యోగ యువతకు కేటాయించి ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి అవకాశాలు కేంద్ర ప్రభుత్వం సృష్టించకుంటే నిరుద్యోగ యువత ఉద్యమాల బాట, నిరుద్యోగ హక్కులకై ఉద్యమించాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.



# కేంద్ర బడ్జెట్ పత్రాలను తగలబెట్టిన సిపిఐ

తొర్రూర్, (నేటి ఫోకస్ న్యూస్)-జూలై 24:

పట్టణ కేంద్రంలో మహాత్మా గాంధీ సెంటర్లో లోని సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినటువంటి బడ్జెట్ లో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం చేశారని బడ్జెట్ పత్రాలను తగలపెట్టి నిరసన తెలపడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఓమ బిక్షపతి.. సిపిఐ మండల కార్యదర్శి బందు మహేందర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలంగాణ రాష్ట్రానికి అనేక హామీలు ఇవ్వడం జరిగిందని, తెలంగాణ రాష్ట్రంలో ఎనమిది మంది ఎంపీలు, ఎనమిది మంది ఎమ్మెల్యేలు వుండి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ బడ్జెట్లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేయడం జరిగిందన్నారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ సుమారు రెండు గంటల పాటు మాట్లాడినప్పటికీ ఒక్క మాట కూడా తెలంగాణ రాష్ట్రం పేరు ప్రసంగించలేదు అని అన్నారు. విభజన సమయంలో ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చలేదని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కు తీవ్ర అన్యాయం జరిగిందని రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమకు, ములుగులో గిరిజన యూనివర్సిటీకి నిధులు కేటాయించకపోవడం చాలా సిగ్గుచేటు అని అన్నారు. వ్యవసారంగానికి, విద్యారంగానికి, పరిశ్రమలకు, ఇతర వాటికి అధిక నిధులు కేటాయించకపోవడం చాలా దారుణమని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం చేసిన బిజెపి పార్టీకి ఎంపీలు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నీ అంబానికి, ఆదానికి కట్టబెట్టే ప్రయత్నాలు చేస్తుందని తెలిపారు.తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం చేసిన బిజెపి ప్రభుత్వం పైన అన్ని రాజకీయ పార్టీలు పెద్ద ఎత్తున కేంద్ర ప్రభుత్వం పైన పోరాటాలు చేయాలని కోరారు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో కేంద్ర బడ్జెట్ పైన చర్చ జరిపి తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు..ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి పెరబోయిన కిరణ్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గణపురం లక్ష్మణ్, వెంకన్న, యాకయ్య, చంద్రయ్య, వీరన్న, మల్లయ్య, రమేష్ పాల్గొన్నారు.



# గిరిజన అభివృద్ధి అధికారిని సన్మానించిన డైలీవేజ్ వర్కర్స్

అచ్చంపేట, (నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి)-ఆర్.భరత్ జూలై 24:

నాగర్ కర్నూల్ జిల్లా కు నూతనంగా వచ్చిన గిరిజన సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి ఏం ఫిరంగి కు గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న డైలీ వైస్ వర్కర్స్ యూనియన్ నాగర్ కర్నూల్ జిల్లా కమిటీ జిల్లా నాయకులు మూడవత్ గోపాల్ ఆధ్వర్యంలో జిల్లాలో పనిచేస్తున్న డైలీ వైజ్ వర్కర్లు యూనియన్ సభ్యులతో కలిసి డిటిడిఓను సన్మానం చేస్తూ పూల బొకే ఇవ్వడం జరిగినది. అదేవిధంగా గత మూడు సంవత్సరాలుగా ఇన్చార్జి గిరిజన అభివృద్ధి అధికారిగా పనిచేసిన కమలాకర్ రెడ్డి పూల బొకే ఇస్తూ శాలువాతో సన్మానం చేయడం జరిగినది. ఈ సందర్భంగా యూనియన్ ప్రెసిడెంట్ గోపాల్ నాయక్ మాట్లాడుతూ మూడు సంవత్సరాల నుంచి డైలీ వైస్ వర్కర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా జీతా బత్యాలతో పాటు అన్ని విధాలుగా ఆపద్బాంధవుడుగా పనిచేసిన డి టి డి ఓ కమలాకర్ రెడ్డిని మరిచిపోలేమని గుర్తు చేశారు ఈ కార్యక్రమంలో దుమావత్ జానకిరామ్. ముసలయ్య, వెంకటేష్, కే రవి, చంద్రకళ,పద్మ, ఏండి అలీ, వి రాములు, కే పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.



# అత్యవసర సేవలకు అవార్డు

వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:

ప్రభుత్వ ఆసుపత్రుల్లో 108 అంబులెన్స్ అత్యవసర సర్వీసులో టెక్నీషియన్ గా సేవలందిస్తున్న శశి కుమార్ ఉత్తమ టెక్నీషియన్ అవార్డుకు ఎంపికయ్యారు. అలాగే ఉత్తమ పైలట్ గా మహేష్ ఎంపికయ్యారు. శ్రీరంగాపూర్ మండలం తాటిపాముల గ్రామానికి చెందిన శశి కుమార్, వనపర్తిలో గత పది ఏళ్లుగా 108 అంబులెన్స్ లో టెక్నీషియన్ గా విధులు నిర్వహిస్తూ అత్యవసర సమయంలో గర్భిణీలకు ప్రసవాలు చేసి అందరి మన్ననలు పొందారు. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్ లోని 108 కార్యాలయంలో సీఈఓ ఖలీద్, ప్రోగ్రాం మేనేజర్ మహబూబ్ చేతుల మీదుగా వారు ఉత్తమ టెక్నీషియన్, ఉత్తమ పైలట్ అవార్డులు అ ం ద ు క ు న్నా ర ు . కార్యక్రమంలో ఈఎంఈ రత్నం, ఉదయ్ పాల్గొన్నారు.



నేటి ఫోకస్ న్యూస్





## హాకి అకాడమీకి వనపర్తి బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి

- ఫిజికల్ డైరెక్టర్ బోలెమోని కుమార్

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే హాకీ అకాడమీకి వనపర్తి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థి అనిల్ కుమార్ ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ బొలెమోని కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 3, 4 తేదీలలో జిల్లా కేంద్రంలోని డాక్టర్ బాలకృష్ణయ్య క్రీడా ప్రాంగణం లో నిర్వహించిన హాకీ అకాడమీ ఎంపికలో అనిల్ కుమార్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి హాకి అకాడమీకి ఎంపికయ్యారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం బాలకృష్ణయ్య క్రీడా ప్రాంగణంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తారాబాయి తో పాటు కుమార్ విద్యార్థికి క్రీడా సామాగ్రి అందజేసి అభినందనలు తెలిపారు.



## గీతాంజలి లయన్స్ క్లబ్ సేవలు అమోఘం

- మీర్ పేట్ మేయర్ దుర్గా దీపాలాల్

**మీర్ పేట్ ప్రతినిధి, నేటి ఫోకస్ న్యూస్:** జిల్లెల గూడకు చెందిన గీతాంజలి లయన్స్ క్లబ్ సేవలు అమోఘమని మీర్ పేట్ మేయర్ దుర్గా దీపాలాల్ ప్రశంసించారు. బుధవారం స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో అధ్యక్షులు భాస్కర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే పేద విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా కంటి శిబిరాన్ని నిర్వహించి సుమారు 200 మంది చిన్నారులకు పంకి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆపరేషన్లతో పాటు కంటి అద్దాలు, కంటి చుక్కలు, మందులు ఇవ్వడం శుభ పరిణామన్నారు. అలాగే లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు అన్నదాన కార్యక్రమాలు విరివిగా నిర్వహించడంతో క్లబ్ సభ్యులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో 320%ఖ% జిల్లా టిడిపి చిన్న కిషన్ రెడ్డి, విడిజి వన్ డాక్టర్ మహేంద్ర కుమార్ రెడ్డి, ఆర్ సి ఏ మహేందర్ రెడ్డి, జెర్సీ, హరిబాబు, నూతన అధ్యక్షులు సూరసాని భాస్కర్ రెడ్డి, ఆర్ ఎస్ ఈ బుచ్చయ్య జిల్లా జాయింట్ సెక్రటరీ తాళ్ల అంజయ్య, జిల్లెలగూడ గీతాంజలి క్లబ్ చాటర్ అధ్యక్షులు సొరసాని సుధాకర్ రెడ్డి, కార్యదర్శి హరీష్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

## తెలంగాణ కళావేదిక సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షులుగా రామ కమల్ హాసన్

**మిర్యాలగూడ, జూలై 24 (నేటి ఫోకస్ న్యూస్)** తెలంగాణ ఉద్యమం ఉధృతంగా జరుగుతున్న సందర్భంలో సాంస్కృతిక ఉద్యమాన్ని తన ఆట పాట ద్వారా ప్రజల్లోకి తీసుకవెళ్లడంలో ప్రముఖ పాత్ర పోషించిన వేములపల్లి మండలం సల్కునూర్ గ్రామానికి చెందిన రామ కమల్ హాసన్ తెలంగాణ సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షులుగా తెలంగాణ కళావేదిక రాష్ట్ర అధ్యక్షులు నకిరేకంటి కిరణ్ కుమార్ నియమించడం జరిగింది.



ఈ సందర్బంగా రామ కమల్ హాసన్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం లో కీలక పాత్ర పోషించిన కళాకారులకు గత ప్రభుత్వంలో తెలంగాణ సాంస్కృతిక సారథి పేరుమీద 550 ఉద్యోగాలు ఇవ్వడం జరిగింది. ఇచ్చిన ఉద్యోగాలలో ఎక్కువ శాతం తెలంగాణ ఉద్యమానికి సంబంధం లేని అనర్హులకు ఉద్యోగాలు ఇవ్వడం జరిగింది. కీలకంగా తెలంగాణ ఉద్యమంలో పనిచేసి అర్హులు అయిన మా ఉద్యమ కళాకారులకు అన్యాయం చేయడం జరిగింది. ఈ విషయంలో గత ప్రభుత్వాన్ని 10 సంవత్సరాలుగా తమకు న్యాయం చేయలేకపోయింది. 10 సంవత్సరాలుగా వేడుకుంటున్నా స్పందన లేకుండా పట్టించుకోకుండా మేము చేసే ఉద్యమాలను అణిచివేసి నానా ఇబ్బందులు పెట్టడం జరిగింది. గత ప్రభుత్వం గద్దె దిగాలని మరొక ఉద్యమాన్ని తెలంగాణ కళా వేదిక ఆధ్వర్యంలో చేయడం జరిగింది. గత ప్రభుత్వం పోయింది. ఇప్పుడు ప్రజా పాలన మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంలో మాకు న్యాయం జరుగుతుంది అని ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నాము. అందుకు మా మీద ఈ ప్రభుత్వం సానుకూలంగా ఉండడం హర్షనీయం నా నియామకానికి సహకరించిన రాష్ట్ర కార్యదర్శి గజవెల్లి ప్రతాప్, రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి జవ్వాజి ప్రవీణ్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి కాటేపాక శంకర్, అలాగే నల్గొండ జిల్లా అధ్యక్షులు కార్యదర్శి పందిరి సైదులు, పాలడుగు ఆంజనేయులు, అంకెపాక కోటేష్, కందుకూరి సుదర్శన్, వల్లంపట్ల అబ్రహం, నకిరేకంటి వేణు, బచ్చలకూరి శోభన్ బాబు, అంకెపాక నాగరాజు తదితరులు హర్షం వ్యక్తం చేయడం జరిగింది. సంఘం బలపడడం కోసం అహర్నిశలు పనిచేస్తానని తెలంగాణ కళావేదిక రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షులు రామ కమలహాసన్ తెలియజేయడం జరిగింది.

# నామాల బాలస్వామి సంస్మరణ సభను జయప్రదం చేయండి!

- కులనిర్మూలనా పోరాట సమితి పిలుపు..

**ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా ప్రకటన (నేటి ఫోకస్ న్యూస్) చారకొండ వెంకటేష్ జూలై 24:** నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట తాలూకా కేంద్రంలో టీఎన్జీవో భవనంలో రేపు జరిగే నామాల బాలస్వామి సంస్మరణ సభను జయప్రదం చేయాలని కులనిర్మూలనా పోరాట సమితి జిల్లా కన్వీనర్ ముద్దునూరి లక్ష్మీనారాయణ అన్నారు. అమ్రాబాద్ మండలంలోని మన్ననూర్ గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... 2001వ. సంవత్సరం జులై 26 నాడు అప్పటి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా పెద్ద కొత్తపల్లి మండలం కల్వకోలు గ్రామంలో అగ్రకుల మనువాదులు, కాలుతున్న వరిగడ్డివామిలో బతికివున్న నామాల బాలస్వామిని విసిరేసి సజీవ దహనం చేశారన్నారు. ఏదేశంలో లేనటువంటి నిచ్చెన మెట్ల కులవ్యవస్థను భారతదేశంలో కొనసాగిస్తూ ..!!అగ్రకుల మనువాదులు ఎన్నోసార్లు దలితులపై ధారుణ మారణ కాండలు కొనసాగిస్తున్నా ! పాలకులు, పోలీసులు ఏమాత్రం పట్టించుకోక పోవడం వల్లనే కారంచేడు నుండి కల్వకోలు నామాల బాలస్వామి వరకు మూకుమ్మడి హత్యలు, సజీవదహనాలు జరుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కులనిర్మూలనా పోరాట సమితి ఆధ్వర్యంలో " జులై17 ( కారంచేడు) నుండి ఆగస్టు 6(చుండూరు) దాకా వాడ వాడలో దళిత మృత వీరులను స్మరించుకుందాం"కార్యక్రమంలో భాగంగా ఈ నెల జులై 26 నాడు నామాల బాలస్వామి సంస్మరణ సభ నిర్వహిస్తామన్నారు. ఈ సభకు కులనిర్మూలనా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జయరాజు, ప్రధాన కార్యదర్శి అభినవ్ బూరంతో పాటు రాష్ట్ర కమిటీ



నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఈ సభకు దళిత, ప్రజా, విద్యార్థి, ఉపాధ్యాయ, మహిళా సంఘాల నాయకులు, మేధావులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ సమావేశంలో కులనిర్మూలనా పోరాట సమితి నాగర్ కర్నూలు జిల్లా నాయకులు మంతటి పర్వతాలు, ఎడ్ల సుల్తాన్, సామ మల్లేష్, అనంతరాములు, సురేష్ లు పాల్గొన్నారు.



## విద్యార్థులు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచాలి

- క్రీడాకారులకు జెపి యువసేన ఆధ్వర్యంలో జెర్సీలు పంపిణీ
- క్రీడాకారులకు సహాయ సహకారాలు అందిస్తా: జంపన ప్రతాప్

**ఫోకస్ న్యూస్ సికింద్రాబాద్ కంటోన్మెంట్ జూలై 24:**

కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఎంతోమంది అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచారని, వారిని ఆదర్శంగా తీసుకొని నేటి యువత జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జంపన ప్రతాప్ అన్నారు. రాబోయే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కు మండల స్థాయి తరుపున తిరుమలగిరి స్పోర్ట్స్ ఆటల పోటీలలో పాల్గొనందుకు సిద్ధమవుతున్న విద్యార్థులకు, స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు ప్రకాష్ భాటియ, పవన్, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జ్యోతి లతో కలిసి జంపన్న ప్రతాప్ విద్యార్థులకు జెర్సీలను అందజేశారు. ఈ సందర్భంగా జంపన్న ప్రతాప్ మాట్లాడుతూ... విద్యార్థులు జాతీయ అంతర్జాతీయ స్థాయిలలో ప్రతిభ కనబరచాలని, అందుకు పూర్తిగా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. క్రీడలను ప్రోత్సహిస్తున్న జంపన ప్రతాప్ కు, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ స్కూల్ విష్ణువర్ధన్ రెడ్డి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మేడా ఆశీర్వాదం, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ స్కూల్ విష్ణువర్ధన్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు షద్రక్, సామాజిక కార్యకర్త బాలాజీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు సిరాజ్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



## నిధులిస్తే కంటోన్మెంట్ మరింత అభివృద్ధి

- సమస్య ఏదైనా పరిష్కారం మా లక్ష్యం
- కంటోన్మెంట్ బోర్డు ఉపాధ్యక్షుడు జన్యావుల రామకృష్ణ

**ఫోకస్ న్యూస్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ జూలై 24:** కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఏ సమస్య ఉన్న పరిష్కరించడమే మా బాధ్యత అని, కంటోన్మెంట్ బోర్డు ఉపాధ్యక్షుడు జన్యావుల రామకృష్ణ అన్నారు. బుధవారం కంటోన్మెంట్ లోని కాకగూడ, బ్రోక్ బండ్ కాలనీ లో బస్తీబాట కార్యక్రమంలో రామకృష్ణ స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కాక గూడ హనుమాన్ ఆలయం వద్ద సీసీ రోడ్డు నిర్మాణం మరియు బ్రోక్ బాండ్ కాలనీలో మురుగునీటి కాలువ నిర్మాణానికి సంబంధించిన సమస్య తెలుసుకుని త్వరలోనే వాటి నిర్మాణం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కంటోన్మెంట్ అభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వం లోని కేంద్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తూ నిధులు విడుదల చేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా తమ బాధ్యతగా నిధులు ఇస్తే కంటోన్మెంట్ మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాసెట్టి కృష్ణ, భిక్షపతి, శంకర్, బాలకృష్ణ, అనీష్, సత్యనారాయణ పాల్గొన్నారు.





## మహిళలపై జరుగుతున్న ఆకృత్యాలకు హెూంమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలి

**బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ మేకల శిల్పారెడ్డి**

**వనపర్తి ప్రతినిధి, నేటి ఫోకస్ న్యూస్:** తెలంగాణ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న ఆకృత్యాలకు హెూం మంత్రిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ మేకల శిల్పారెడ్డి అన్నారు. బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా ఆమె వనపర్తికి వచ్చిన సందర్భంగా మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అశ్విని రాధ అధ్యక్షతన ఆమెకు భారీ గజమాలతో ఘన సన్మానం చేశారు. ఆ తర్వాత మంగళవారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ అన్ని వర్గాలకు సమన్యాయం చేసేలా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వ్యవహరించారని అందుకు ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతలు రోజు రోజుకు క్షీణిస్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై దృష్టి పెట్టకుండా ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలను చేర్చుకునే వ్యవహారాల్లో తలమునకులై ఉన్నాడని విమర్శించారు. కేంద్ర బడ్జెట్ అన్ని వర్గాలకు మేలు చేసేలా ఉన్నప్పటికీ కాంగ్రెస్ నాయకులు విడ్డూరంగా విమర్శలు చేయడం తగదన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నారాయణ నాయకులు లోక్నాథ్ రెడ్డి అయ్యగారి ప్రభాకర్ రెడ్డి జ్యోతి రమణ అలివేలు కల్పన సూగూరు లక్ష్మి అరుణ కవితా పద్మ సీతారాములు బండారు కుమారస్వామి బచ్చు రాము రాయన్న సాగర్ సూగురు రాము తదితరులు పాల్గొన్నారు.



## చెరువులో గుర్తుతెలియని మహిళా శవం లభ్యం

**ఉమ్మడి మహబూబ్నగర్ ప్రతినిధి, (నేటి ఫోకస్ న్యూస్)–చారకొండ వెంకటేష్, జూలై 24:** అచ్చంపేట పట్టణంలోని బుధవారం ఉదయం చెరువులో గుర్తు తెలియని మహిళ శివ లభ్యం... కావడం పట్ల ఒక్కసారి ఈ మహిళ ఎవరు... ఎలా చనిపోయారు అన్న కోణంలో అచ్చంపేట ఎస్సై రాములు యాదవ్ ఆరా తీస్తున్నారు. బుధవారం అందుకు సంబంధించిన ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం... అచ్చంపేట పట్టణంలోని మల్లంకుంట చెరువుకు ఎదురుగా పెట్రోల్ బంక్ కు అనుసరించుకొని ఉన్న చెరువు కుంటలో గుర్తుతెలియని మహిళ శవం మై నీళ్ళ పైన తేలుతూ పలువురు కంట కనపడడం జరిగిందని ఎస్ఐ తెలిపారు. గత మూడు రోజుల క్రితమే మహిళా చెరువులో పడి చనిపోయినట్లుగా పోస్టుమార్టం లో గుర్తించడం జరిగిందన్నారు. మృతురాలపై పచ్చని జాకెట్, ఆకుపచ్చని గాజులు వేసుకొని ఉందని తెలిపారు. ఇట్టి విషయంపై పూర్తిస్థాయిలో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నామని ఎస్సై అన్నారు. చెరువులో పడి గుర్తు తెలియని మహిళ మృతదేహం కనిపించడం పట్ల పట్టణ ప్రజలు, వాహనదారులు, బాటసారులు తండోపతండాలుగా చెరువు దగ్గరికి వచ్చి మృతదేహాన్ని చూసి ఆశ్చర్యానికి గురి అయ్యారు. మహిళ ఎలా మృతి చెందిందన్న విషయం పై అచ్చంపేటలో బాగా చర్చరించంగా కొనసాగుతుంది.

